
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
సోమవారం 29 సెప్టెంబరు 2025



నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

● జిల్లా విద్యుత్‌శాఖ అధికారి జాడే ఉత్తమ్

హాజీపూర్, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు మంచిర్యాల జిల్లా విద్యుత్‌శాఖ అధికారి(ఎస్‌ఈ) జాడే ఉత్తమ్ అన్నారు. ఆదివారం ర్యాలీగడ్‌పూర్ సబ్ స్టేషన్‌లో నూతనంగా 3.15ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్, బేకర్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ ర్యాలీగడ్‌పూర్ సంక్షేమ పరిధిలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వడానికి వీలుకలుగుతుందని ఈ నూతన ట్రాన్స్‌ఫార్మర్, బేకర్ల ద్వారా ప్రాంత ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ కైసర్, ఏడీఈ వెంకటేశ్వర్లు, శరత్ కుమార్, ఏఈ మహేందర్ రెడ్డిలు పాల్గొన్నారు.

గ్రూప్-1లో సత్తా చాటిన సాయిశ్రీజ

● బీసీ డెవలప్‌మెంట్ అధికారిగా ఎంపిక



సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకుంటున్న సాయిశ్రీజ

లక్సెట్టిపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఫలితాల్లో లక్సెట్టిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చుంచు సాయిశ్రీజ బీసీ డెవలప్ మెంట్ అధికారిగా ఉద్యోగం సాధించింది. సాయిశ్రీజ తల్లిదండ్రులు చుంచు పోశయ్యా-చంద్రకళ. తండ్రి శ్రీరాంపూర్‌లో సింగరేణి ఉద్యోగి. ఆరెనెలల క్రితం సాయిశ్రీజ గ్రూప్-4లో సత్తాచాటి కమర్షియల్ టాక్స్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం సాధించింది. విధులు నిర్వహిస్తూనే గ్రూప్-1కు ప్రిపేర్ అయి అనుకున్నలక్ష్యం సాధించింది. శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకుంది. సాయిశ్రీజ ఐదోతరగతి వరకు మంచిర్యాలలోని లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో, ఎస్సెస్సీ రెవలేషన్ పాఠశాలలో పూర్తి చేసింది. ఇంటర్, డిగ్రీ హైదరాబాద్‌లో చదివింది. బీసీ డెవలప్‌మెంట్ ఆఫీజర్‌గా ఎంపికైన సాయిశ్రీజను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సన్మానించి అభినందించారు.

మహిళలే మహారాణులు..!

- స్థానిక ఎన్నికల రిజర్వేషన్లలో వారికే అందలం
- జనరల్ కేటగిరీలోనూ బరిలో నిలవనున్న అతివలు
- మొత్తంగా 50 శాతం రిజర్వేషన్లు మహిళలకే
- జడ్పీ పీఠాన్ని అధిరోహించనున్న బీసీ మహిళ



మంచిర్యాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో మహిళలు బరిలోకి దిగనున్నారు. బీసీ రిజర్వేషన్లతోపాటు ప్రత్యేక మహిళా కోటాతో కలిపి ప్రభుత్వం వారికే అధిక సీట్లు కేటాయించింది. దీంతో రాజకీయ పార్టీలు సైతం మహిళలను రంగంలోకి దింపేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. ఇప్పటి దాకా రాజకీయానుభవం లేకపోయినా, రిజర్వేషన్లు అనుకూలించినందున తమ కుటుంబాల్లోని మహిళలను పోటీలో నిలబెట్టడం ద్వారా పురుషులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలనే నిర్ణయంతో ఉన్నట్లు తెలుస్తోంది. మరో వైపు మహిళలు బరిలో నిలిస్తే ఆ విభాగం ఓట్లు తేలిగ్గా రాబట్టుకోవడంతో పాటు, చట్ట సభల్లోకి నారీమణులు అధికంగా వెళ్లేలా ప్రజలే ప్రోత్సహించే అవకాశాలున్నాయి. ఈ కారణంగా త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళల భాగస్వామ్యం పెరగనుంది.

రిజర్వేషన్లు మహిళలకే అనుకూలం...

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు వారికే అనుకూలిస్తుండగా, నిబంధనల ప్రకారం చూసినా వారికి 50 శాతం సీట్లు కేటాయించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇవే గాకుండా మిగతా 50 శాతం సీట్లలో జనరల్ కేటగరీకి కేటాయించే స్థానాల్లోనూ మహిళలు పోటీ చేసే అవకాశాలు అధికంగా ఉన్నాయి. గతంలో జరిగిన ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో పోటీచేసి, గెలిచిన మహిళల సంఖ్య అధికంగానే ఉంది. వచ్చే ఎన్నికల్లో కూడా మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు జనరల్ స్థానాల్లో కూడా కొందరు మహిళలను రంగంలోకి దింపాలని ఆయా పార్టీల ముఖ్య నేతలు భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా మహిళా ఓటర్లే అధికంగా ఉండటంతోపాటు ప్రతి ఎన్నికల్లోనూ వారే అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయిస్తున్నారు. దీంతో వివిధ పార్టీలకు చెందిన ముఖ్య నేతలు సైతం గ్రామాల్లో ఎక్కువగా మహిళలకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా వివిధంగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. అలాగే ప్రభుత్వం కూడా మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ వారి కోసం ప్రత్యేకంగా పలు పథ కాలు ప్రవేశపెట్టింది. పలు పథకాలు ప్రత్యేకంగా మ హిళల కోసం ఉద్దేశించినవే కావడంతో మహిళా ఓట ర్లను ఆకర్శించడం తేలికనే భావనతో అధికార పార్టీ నాయకులు ఉన్నారు. కాంగ్రెస్‌తోపాటు ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్‌ఎస్, బీజేపీలు సైతం మహిళలను రంగంలోకి దింపాలన్న యోచనలో ఉన్నారు. స్థానిక ఎన్నికల్లో మహిళలను రంగంలోకి దింపితేనే తమ పని సులువు అవుతుందనే ఉద్దేశంతో ఆయా పార్టీల నాయకులు ఉన్నారు.

జడ్పీటీసీ ఎన్నికల్లో..

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 16 మండలాల పరిధిలో మొత్తం 16 జడ్పీటీసీలు, 16 ఎంపీపీలతోపాటు 129 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. వాటికి సంబంధించి ఈ నెల 27న స్థానాల వారీగా రిజర్వేషన్లు సైతం ఖరారయ్యాయి. కులగణన ఆధారంగా జనాభా దామాషా ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించగా, ఎస్సీ, ఎస్టీ, తదితర కులాలకు 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయనున్నారు. స్థానిక ఎన్నికల్లో మహిళల రిజర్వేషన్ స్థానాలతోపాటు ఆయా సామాజిక వర్గాల జనరల్ కేటగిరీల్లోనూ మహిళలకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని మొత్తం 16 స్థానాలకుగాను ఏడు సీట్లను మహిళలకు కేటాయించారు. వీటితోపాటు జనరల్ కేటగిరీకి మూడు సీట్లు కేటాయించగా, అందులోనూ మహిళలు బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. అలాగే 16 ఎంపీపీ స్థానాలకుగాను మహిళా కోటా కింద 7 సీట్లను స్త్రీలకు కేటాయించారు. అలాగే వీటిలోనూ మూడు సీట్లు జనరల్ కేటగరీకి కేటాయించారు. వాటిలోనూ మహిళలు పోటీపడే అవకాశాలు ఉన్నాయి. తద్వారా జడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికల్లో 50 శాతం మేర మహిళలు రంగంలోకి దిగనున్నారు.

ఎంపీటీసీ విభాగంలో...

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ విభాగంలోనూ రిజర్వేషన్ దామాషానా ఎస్టీ, ఎస్సీ బీసీతోపాటు జనరల్ స్థానాల్లో మహిళలకు 50 శాతం సీట్లు రిజర్వు చేశారు. జిల్లాలోని 16 మండలాల పరిధిలో మొత్తం 129 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. వాటిలో 50 శాతం మేర మహిళల కోటాతో కలిపి దాదాపు సగం సీట్లలో అతివలు బరిలో నిలిచే అవకాశాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఎంపీటీసీ..

(తరువాయి 7లో)

గోదావరి నీటి మట్టాన్ని పర్యవేక్షించాలి

● కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కురుస్తున్న వర్షా లు, ఎగువ ప్రాంతాల నుంచి చేరుతున్న వరద నీటి కారణంగా గోదావరి నది తీరంలో నీటిమట్టం పరిస్థితి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులోగల గోదావరినది తీరంలో వరదనీటి పరిస్థితిని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న వరద పరిస్థితులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎగువప్రాంతాల్లో కురిసిన వర్షాలతో కడెం, ఎస్సారెస్పీ నుంచి వరద నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేసినందున శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వరదనీటిని విడుదల చేశామన్నారు. ఈనేపథ్యంలో గోదావరి నదిలో చేరుతున్న వరదనీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజారక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. గోదావరినది వద్ద మున్సిపల్, పోలీసులశాఖల సమన్వయంతో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. నదితీరానికి వెళ్లకుండా బారీ కేడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయనవెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీదే గెలుపు

● రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు



దొనబండలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి రఘునాథ్‌రావు

హాజీపూర్, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి) : రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపుఖాయమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని దొనబండలో మాజీ వైస్ ఎంపీపీ బేతు రమాదేవి రవిల ఆధ్వర్యంలో బీజేపీలోకి చేరికల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రఘునాథ్‌రావు మాట్లాడుతూ ప్రధానిమోదీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు దేశ వ్యాప్తంగా హర్షిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై చిత్తశుద్ధిలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల నిర్వహణను అడ్డుకునేందుకు ఆ పార్టీకి సంబంధించిన వ్యక్తులతోనే కేసులు వేయిస్తున్నారన్నారు. అనంతరం పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గడ్డం స్వామి, ముఖేశ్‌గౌడ్, క్రిష్ణమూర్తి, వెంకటేశ్వర్‌రావు, అశ్విన్, ప్రశాంత్, వెంకటకృష్ణ కమలాకర్‌రావు, సతీష్ పాల్గొన్నారు.

ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

● టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు జగదీశ్వర్

నస్పూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. నస్పూర్‌లోని టీఎన్‌జీవోఎస్ హౌసింగ్ సొసైటీలో ఆదివారం మంచిర్యాల యూనిట్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కార్యాలయం అవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా యూనిట్ నాయకులు రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్‌ను ఘనంగా సత్కరించారు. అనంతనం జరిగిన సమావేశంలో జగదీశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల సాధనకు టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందన్నారు. ఇప్పటి వరకు 317 జీవో బాధితులకు ఉపయోగపడే విధంగా జీవో 190 సాధించిన ఘనత జేఏసీకే దక్కిందన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సంద అశోక్, జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, జిల్లా కార్యదర్శి రాంమోహన్‌రావు, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు గోపాల్, నాయకులు మల్లయ్య, బాపురావు, హన్మంతరావు, సురేష్‌బాబు, కోశాధికారి సతీష్‌కుమార్, ఉపాధ్యాకులు కేజియా రాణి, శ్రీనివాస్, తిరుపతి, సంయుక్త కార్యదర్శి సునితల తోపాటు జిల్లాలోని వివిధయూనిట్ల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు రాష్ట్ర కార్యదర్శిగా సమ్మయ్య పటేల్

కోటపల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాపనపల్లి గ్రామానికి చెందిన గుర్రం సమయ్య పటేల్‌ను తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్రకార్యదర్శిగా సంఘం రాష్ట్రనాయకులు నియమించారు. ఈ సందర్భంగా సమ్మయ్య పటేల్ మాట్లాడుతూ బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా నియమించి నందుకు నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని తెలిపారు.

మున్నూరు కాపుల సమైక్యతకు కృషి

నస్పూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మున్నూరు కాపుల సమైక్యతకు పటేల్స్ ఎంటర్ ప్రెన్యూర్స్ నెట్‌వర్కు (పెన్) కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగాం రాజారాం అ న్నారు. నస్పూర్ కాలనీలో ఆదివారం పెన్ కోఆర్డి నేటర్ భరత్‌కుమార్ ఆధ్వర్యంలో మున్నూరు కాపుల పరిచయం, పెన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. మున్నూరు కాపులు అన్ని రంగాల్లో రాణించే విధంగా పెన్ కృషి చేస్తుందని రాజారాం పేర్కొన్నారు. ఈ సమావేశంలో పెన్ వాలంటరీ సభ్యులు సాదినేని రమేష్, కాశెట్టి సుధాకర్, అభినవ్, పెంచాల వేణు, శేఖర్, అన్వేష్, వెంకటేశ్, సత్యం, రాజేశం, రవీందర్, శ్రీపతి సదయ్య, తిరుపతి పాల్గొన్నారు.

సాగుకు అవసరమైన యూరియా ఉంది

● కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పంటల సాగుకు అవసరమైన యూరియా అందు బాటులో ఉందని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని సుద్దాల గ్రామంలోని ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. యూరియా నిల్వలు, రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా అందించాలని ఏవోకు సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రైతులందరికి పంటలసాగుకు అవసరమైన యూరియా అందించేందుకు వ్యవసాయశాఖ అధికారులద్వారా చర్యలు చేపడుతున్నారు. రైతులు అవసరమైన మేరకే బస్తాలు తీసుకుని సాగుకు వినియోగించు కోవాల న్నారు. ముందస్తు సాగుకు తీసుకోవద్దన్నారు. యూరియా పక్కదారి పట్టకుం డా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పంటలు సాగు చేస్తున్న రైతులకు సమయాను సారంగా యూరియాను అందిస్తామని, రైతులందరూ సహకరించాలని తెలిపారు. ఆయన వెంట ఏవో యామిని, ఎంపీడీవో మోహన్ ఉన్నారు.



సుద్దాల గ్రామంలో ఏవోతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

యూరియా కోసం రైతుల పడిగాపులు


మండలంలోని దుగ్నేపల్లి గ్రామంలో గల రైతు సేవ కేంద్రానికి ఆదివారం 266 యూరియా బస్తాలు వచ్చాయి. వ్యవసాయ శాఖ అధికారులు ఆయా గ్రామాల్లోని రైతు వేదికల వద్ద ఒక్కో రైతుకు ఒక్కో బస్తాను పంపిణీ చేశారు. యూరియా కోసం రైతులు క్యూలైన్‌లలో పడిగాపులు కాశారు.

స్థానిక సమరానికి సమాయత్తం కావాలి

జన్నారం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానికసంస్థల ఎన్నికల సమరానికి సమాయత్తం కావాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆయా మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని, పూర్తిస్థాయిలో ప్రతిఇంటింటికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరించాలని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయతీ, ప్రతి ఎన్నికలస్థానం కాంగ్రెస్‌దే కావాలన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారా యణ, మండల అధ్యక్షులు ముజాఫర్ అలీ, నాయకులు అల్లం రవి, పంకజ, ఇసాక్, ఇంధయ్య, మాణిక్యం, శంకరయ్య, రమేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పనితీరుపై అసంతృప్తి

బెల్లంపల్లి,సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గడ్డం వినోద్ పనితీరుపై అసంతృప్తితో ఉన్నామని సీనియర్ కాంగ్రెస్ నాయకులు సూరిబాబు, జయరాంయాదవ్ అన్నారు. ఆదివారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వ హించుకొని మాట్లాడారు. ఎమ్మెల్యే వినోద్ సీని యర్ కాంగ్రెస్ నాయకులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన నాయకులను దగ్గర తీస్తున్నార న్నారు. బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీకి సంబంధంలేని అనామకులను చేరదీస్తూ పీఏల పరిపాలన నడుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ గెలుపుకోసం కృషి చేసిన సీనియర్ నాయకులను గుర్తించాలని లేని యెడల భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీ మనుగడకు ఉండదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



లాభాల పూ'బంతి'



- ఎల్కపల్లి, హేటిగేడ గ్రామాల్లో బంతి సాగు
- బతుకమ్మ సీజన్‌లో ఆదాయం పొందుతున్న రైతులు



బెజ్జూరు మండలంలో రైతులు సాగు చేస్తున్న బంతిపూల తోట

బెజ్జూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు బంతి పూలు సాగు చేస్తూ లాభాలు అర్జిస్తున్నారు. వాణిజ్య పంటలు సాగు చేసి... పెట్టిన పెట్టుబడులు రాక రైతులు నష్టాలను చవి చూస్తుంటారు. కానీ కొందరు రైతులు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. ప్రజల అవసరాలను గుర్తిస్తూ కాలానుగుణ పంటల సాగుతో ముందుకు సాగుతున్నారు. ప్రధానంగా బెజ్జూరు మండలంలోని ఎల్కపల్లి, హేటిగూడ గ్రామాల్లో రైతులు పూలసాగు బాటపట్టి సత్ఫలితాలతో తోటి రైతులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. బతుకమ్మ, దేవీ శరన్నవరాత్రులు, దసరా సందర్భంగా అవసరమైన వారికి బంతి పూలు విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు.

● మూడు నెలల్లోనే..

బెజ్జూరు మండలంలోని ఎల్కపల్లి, హేటిగూడ గ్రామాల్లో కొత్రంగి వెంకటి, వడాయి పోశన్న అనే రైతులు బంతిపూలసాగు చేపట్టారు. దసరా పండగకు మూడు నెలల ముందుగానే రైతులు తమకున్న కొద్దిపాటి భూమిలో బంతిసాగు ఆరంభించి పండుగ సమయానికి కల్లా పూల దిగుబడి వచ్చేలా ముందుచూపుతో తోటలు వేశారు. ప్రస్తుతం పల్లెలు, పట్టణాల్లో సంప్రదాయ బతుకమ్మలాటలకు అవసరమైన పూలు సమీపంలోనే అందుబాటులో ఉండటంతో ఇటు సాగుదారులకు, అటు కొనుగోలు దారులకు లాభదాయకంగా మారింది. మూడు నెలల వ్యవధిలో పంట చేతికొచ్చే బంతిని హేటిగూడలో ఒక ఎకరం, ఎల్కపల్లిలో అర ఎకరం వరకు రైతులు సాగు చేశారు. ఎకరాకు పెట్టుబడి రూ.20వేల నుంచి 30వేల వరకు అవుతుండగా సుమారు 30నుంచి 40క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. కేజీ బంతిపూలు ప్రస్తుతం రూ.120వరకు విక్రయిస్తుండడంతో ఆదాయం సైతం అధికంగానే వస్తోందని రైతులు చెబుతున్నారు. దసరా అనంతరం దీపావళి వరకూ విక్రయాలు బాగుండటంతో బంతిసాగు లాభాల బాటగా మారింది. మండలంలోని రైతులు గత మూడేళ్లుగా బంతిసాగును చేపడుతూ లాభాలను గడిస్తున్నారు.

● వాణిజ్య పంటల వైపు చూపు..

ప్రస్తుతం ఎక్కడ చూసినా రైతులు ఎక్కువ మొత్తంలో వాణిజ్య పంటలు సాగు చేస్తూ అవసరాల సాగు అయిన కూరగాయలు, పప్పు దినుసుల సాగును పూర్తిగా మానేయడంతో వాటికి తీవ్ర కొరత ఏర్పడుతోంది. ఇదే అదునుగా భావించిన రైతు లు వినూత్నంగా భావించి అధిక ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు పూలసాగుకు శ్రీకారం చుట్టారు. సీజన్‌కు అనుగుణంగా వినూత్న పంటలు సాగు చేసి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రస్తుతం పూలకు ఉన్న డిమాండ్ మేరకు పండగలకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించి సాగుబాట పట్టారు. ఏ శుభ కార్యంలోనైనా పూలకు ఉండే ప్రాధాన్యం చెప్పనక్కర్లేదు. దీంతో బంతిపూల సాగుకు శ్రీకారం చుట్టారు.

తక్కువ పెట్టుబడి..



బంతిసాగు చేపట్టడం వల్ల తక్కువ పెట్టుబడితో ఆశించిన దిగుబడి వస్తుంది. ఏటా మాకున్న కొద్ది పాటి భూమిలో దసరా సమయానికి పూలు వచ్చేలా బంతిసాగు చేస్తుంటాం. బతుకమ్మలకు కావాల్సిన పూలను అందజేస్తుంటాం. అమ్మకాలు ఆ శాజనకంగా లాభదాయకంగానే ఉంటాయి. దీపావళి వరకు ఇక్కడ విక్రయాలు ఉంటాయి.

- వడాయి పోశన్న రైతు, హేటిగూడ

అడవి పంది మాంసం పట్టివేత

నలుగురి అరెస్టు



నిందితులతో అటవీశాఖ అధికారులు

బెల్లంపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విక్రయానికి సిద్ధంగా ఉన్న అడవి పందుల మాంసాన్ని అటవీశాఖ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకొని నలుగురు నిందితులను అరెస్టు చేశారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం సమాచారం మేరకు మండలంలోని కాసిరెడ్డిపల్లి గ్రామంలో తనిఖీలు చేపట్టగా అడవి పంది మాంసంతో గంధం రాజన్న, సాయిలు పట్టుబడ్డారు. వీరిని అదుపులోకి తీసుకొని విచారించగా కన్నాల గ్రామానికి చెందిన శ్రీనివాస్ తమకు చనిపోయిన రెండు అడవిపందులను అప్పగించినట్లు తెలిపారు. దీంతో అధికారులు శ్రీనివాస్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించారు. పత్తి చేనులో చంద్రమొగిలి, శ్రీనివాస్‌లు కలిసి ఈ నెల 27న విద్యుత్ వైర్లు అమర్చి రెండు అడవిపందులను హతమార్చినట్లు తెలిపారు.. దీంతో నలుగురు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి అడవిపంది మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడులు



పోలీసుల అదుపులో నిందితులు

భీమిని, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజారాం గ్రామ శివారులో ఆదివారం కోడి పందేలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నట్లు భీమిని ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కోడి పందాలు ఆడుతున్నారనే సమాచారం మేరకు రాజారాం గ్రామ శివారులో దాడులు చేశామన్నారు. కోడి పందేలు ఆడుతున్న ముగ్గురు నాయిని సాయి, సిడం సురేష్, కొడిపె శంకర్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్దనుంచి రెండు కోడి పుంజులు, రూ. 1600 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా కోడి పందేలు, పేకాట ఆడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. దాడిలో పోలీసు సిబ్బంది ప్రేంకుమార్, వినోద్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడ నుంచి పుస్తెలతాడు అపహరణ

మందమర్రిరూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్నారం గ్రామంలో శనివారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలు తోట మల్లక్క మెడలో నుంచి రెండు తులాల పుస్తెలతాడు దొంగలు అపహరించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి మల్లక్క ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న పుస్తెల తాడును ఎత్తుకెళ్లారు. అనంతరం తేరుకున్న మల్లక్క అరవడంతో అప్పటికే దొంగలు పారిపోయారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఆదివారం మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి సిబ్బందితో పొన్నారం చేరుకుని వివరాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

లింగాపూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు చేస్తున్న జైనూర్ మండలంలలోని షేకుగూడా దబోలి గ్రామానికి చెందిన మెస్రం సోము అనే వ్యక్తిపై ఆదివారం కేసు నమోదు చేశామని ఎస్సై రవికుమార్ తెలిపారు. సోము తన ఇంటి వెనుక స్థలంలో గంజాయి సాగు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేశామని అన్నారు. తనిఖీల్లో 60 గంజాయి మొక్కలు పట్టుబడ్డాయని తెలిపారు. వాటి విలువ సుమారు ఆరులక్షల రూపాయలు ఉంటుందని ఎస్సై రవికుమార్, సీఐ రమేశ్ తెలిపారు. గంజాయి సాగు చేసినా, విక్రయించినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా గంజాయి సాగు చేస్తున్నట్లు ప్రజలు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని వారు సూచించారు.

బీఆర్‌ఎస్ నాయకుల ర్యాలీ

కాగజ్‌నగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బీఆర్ ఎస్‌లో చేరిన అనంతరం హైదరాబాద్ నుంచి ఆదివారం కాగజ్‌నగర్‌కు చేరుకోవడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రైల్వేస్టేషన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. జడ్పీ మాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీ, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కోనప్పకు స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు

దసరా సెలవులో మార్పు చేయాలి

రెబ్బెన, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ, గాంధీ జయంతి రెండు ఒకే రోజు వస్తున్నందున దసరా సెలవు తేదీని మార్చాలని హెచ్‌ఎంఎస్ వైస్ ప్రసిడెంట్ ఎండీ ఓజీయర్ కోరారు. స్థానికంగా ఆదివారం ఆయన మాటా డుతూ యజమాన్యం కోల్ ఇండియా కార్మికులకు దసరా సెలవు తేదీని మార్చిందని చెప్పారు. సింగరేణిలో కూడా దసరా పండగ సెలవు తేదీని మార్చాలని కోరారు. సమావేశంలో బాంచి సెక్రెటరీ శివారెడ్డి, కిష్టస్వామి, ఎస్‌కె ఇమాస్, ఉమామహేశ్వర్ కిష్టస్వామి, పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): గాంధీ జయంతి, దసరా 2వ తేదీన వచ్చినందున దసరా సెలవును మరొక రోజు ఇవ్వాలని బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. దసరా సెలవును 1వ తేదీగానీ, 3వ తేదీగానీ ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సింగరేణి సీఎండీ బలరాంను కోరారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): సింగరేణిలోని కార్మికులకు అక్టోబరు 3న దసరా సెలవు ప్రకటించాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ ఒక ప్రకటనలో కోరారు. దసరా పండగ అక్టోబరు 2న గాంధీ జయంతి రావడంతో కార్మికులు బొగ్గుబావుల వద్ద చేసే మైసమ్మ మొక్కులకు వీలుండదని తెలిపారు.

'ఎస్సీలకు అన్యాయం'

వాంకిడి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన జడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్ల ప్రక్రియ సక్రమంగా జరగలేదని. ఇందులో ఎస్సీ వర్గానికి అన్యాయం జరిగిందని అంబేద్కర్ సంఘం, బౌద్ధ మహాసభ, సిద్ధార్థ యువజన సంఘం నాయకులు అన్నారు. జేత్వాన్ బుద్ధ విహార్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడారు. మండల వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి అన్ని వర్గాల వారికి రాజకీయ లబ్ధి చేకూరుతుందని అన్నారు. కానీ ఎస్సీ వర్గానికి మాత్రం మండల స్థాయిలో అవకాశం రావడం లేదని తెలిపారు. సమావేశంలో అశోక్, దుర్గాజీ, విజయ్, జయరాం, రోషన్, శ్యాంరావు, రాజేశ్వర్, శ్యాంరావు, ప్రశాంత్, ప్రతాప్ పాల్గొన్నారు.

సికిల్ సెల్‌తో విద్యార్థి మృతి

కాసిపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవా పూర్ డీఏవీ పాఠశాల లో పదో తరగతి చదువుతున్న ఎన్ సత్య సందేశ్ (14) ఆదివారం సికిల్ సెల్ వ్యాధితో చికిత్స పొందుతూ మృతిచెందాడు. జమ్మికుంటకు చెందిన సత్యసందేశ్ కుటుంబం రెండేళ్ల క్రితం ఉపాధి కోసం దేవాపూర్‌కు వచ్చారు. సత్య సందేశ్ తండ్రి గణేష్ డీఏవీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నా డు. కొంత కాలంగా సత్యసందేశ్ తలసేమియా, ఎనీమియాతో బాధపడుతున్నాడు. శనివారం అపస్మార స్థితిలోకి వెళ్లిన సత్యస దేశ్‌ను కరీం నగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి మృతికి పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సంతాపం తెలిపారు.

దసరా కిక్కు లేనట్లే..

» గాంధీ జయంతి రోజే పండుగ



బెజ్జూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దసరా అంటే అందరికీ సంబరమే. కానీ ఈ ఏడాది అక్టోబరు 2 గాంధీ జయంతి రోజు దసరా వస్తోంది. దీంతో అధికారులు మద్యం దుకాణాలు మూసి ఉంచనున్నా రు. ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మద్యం, మాంసం విక్రయాలపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. సాధారణంగా గాంధీ జయంతి రోజున మద్యం, మాంసం దుకాణాలు మూసి వేయడం ఆనవాయితీ. కానీ అన్ని పండుగల మాదిరిగా దసరా ఉండ దు. దసరా, గాంధీ జయంతి ఒకే రోజు వస్తుం డడంతో గ్రామాల్లో మద్యం దుకాణాలు మూసివేయ నుండడంతో ముందస్తుగానే కొంత మంది కొనుగోలు చేసుకుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా..

జిల్లా వ్యాప్తంగా 32మద్యం దుకాణాలు, 3బార్లు ఉండగా, ఇక గ్రామాల్లో బెల్టుషాపులకు కొదవ లేదు. అయితే జిల్లాలో దసరా సందర్భంగా జిల్లాలో కోట్ల రూపాయలు అమ్మకాలు జరుగుతాయి. దీంతో ప్రభుత్వానికి కూడా భారీగానే ఆదాయం సమకూరుతుంది. ఈ సారి దసరా, గాంధీ జయంతి ఒకే రోజు రావడం మద్యం దుకాణాలు మూసివేపిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు ప్రకటించడంతో మద్యం అమ్మకాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్ర ఖజానాకు భారీ గండి పడే అవకాశం లేకపోలేదు.

మద్యం విక్రయిస్తే చర్యలు..



దసరా, గాంధీ జయంతి ఒకేసారి రావడంతో వైన్స్, బార్ షాపులు ప్రభుత్వ ఆదేశాల మేరకు బంద్ ఉంటా యి. బెల్ట్ షాపుల నిర్వాహ కులు ఇతర షాపుల్లో మద్యం విక్రయాలు జరిపినట్లయితే కఠిన చర్యలు చేపడతాం. ఎక్సైజ్ అధికా రులు, సి బ్బంది అప్రమత్తంగా ఉండి మద్యం అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకుంటారు.

- రవి, ఎక్సైజ్ సీఐ, కాగజ్‌నగర్

ప్రధాని మన్‌కీ బాత్‌లో పాల్గొన నాయకులు

రెబ్బెన, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ 126వ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు, బీజేపీ నాయ కులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వీక్షించారు. రెబ్బెన మండల కేంద్రంలో బూతులలో కార్యక్రమాన్ని నాయకులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాంబాబు, నాయకులు తిరుపతి మల్లేష్, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

మహాచండీ అలంకరణలో అమ్మవారు దర్శనం

రెబ్బెన, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం ఇందిరానగర్ గ్రామంలో వెలసిన శ్రీ కనక దుర్గాదేవి స్వయంభు శ్రీ మహంకాళీ దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం అమ్మవారు మహాచండి అలంకరణలో దర్శనమిచ్చింది. భక్తులు అమ్మకు ఒడి బియ్యం, పట్టు వస్త్రాలు, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ గుంటూరు కాలనీలో ఆదివారం దుర్గాదేవి విగ్రహం వద్ద కుంకుమ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉద్యోగానికి ఎంపిక



చందనశ్రీ

బెజ్జూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమిని గ్రామానికి చెందిన గిరిజన యువతీ పంద్రం చందనశ్రీ ఐసీడీఎస్ గ్రేడ్ వన్ సూపర్‌వైజర్ ఉద్యోగానికి ఎంపికైంది. ఈ ఏడాది జనవరిలో ఎంపిక కోసం పరీక్ష నిర్వహించగా ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ఫలితాల్లో ఐసీడీఎస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా ఎంపిక కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చందనశ్రీ తండ్రి భిక్షమయ్య సోమిని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నారు.

చోరీల నియంత్రణకు చర్యలు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చోరీల నియంత్రణ కోసం కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమం చేపడుతున్నట్టు సీఐ కుమార స్వామి అన్నారు. ఈసుగాంలో ఆదివారం కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈసుగాం ఎస్సై కళ్యాణ్ సిబ్బంది పాల్గొన్నారు.

పండుగ పూట పస్తులేనా

- మూడు నెలలుగా అందని వేతనాలు
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పంచాయతీ సిబ్బంది



చెత్తను ఎత్తుతున్న పారిశుధ్య సిబ్బంది

కెరమెరి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వారంతా రెక్కాడితే కానీ డొక్కాడని చిరు ఉద్యోగులు. నెలల తరబడి వేతనాలు రావడం లేదు. చిరుద్యోగులు కావడంతో వారు పని చేస్తున్న గ్రామాల్లో అప్పు సైతం పుట్టడం లేదు. సకాలంలో జీతాలు అందక కుటుంబాలను ఎలా పోషించాలో దిక్కుతోచని స్థితిలో గ్రామ ఎంచాయతీల్లో మల్టీ పర్పస్ వర్కర్, మండల కేంద్రంలో పని చేసే కంప్యూటర్ ఆపరేటర్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ఉద్యోగులకైతే ప్రతీ నెల మొదటి తారీఖున ఇస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోతున్నారు.

● అన్ని పనుల్లోనూ కీలకం..

గ్రామ పంచయాతీ ఎంపీడబ్ల్యూలు రోజూ తెల్లవారింది మొదలు గ్రామాల్లో చెత్త సేకరణ, పారిశుధ్య పనులతో పాటు అన్ని రకాల పనులు చేస్తున్న పంచాయతీ వర్కర్ల బాగోగులను అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. వర్కర్లతో వెట్టి చాకిరి చేయిస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం పంచా యతీ వర్కర్లు ఎదురు చూస్తున్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతోందని చెబు తున్నారు. జూలై నెల నుంచి జీతాలు రాక పోవడంతో సిబ్బంది అల్లాడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 1.236 మందికి ప్రభుత్వం ప్రతీ నెల రూ.9.500 వేతనం చెల్లిస్తోంది. ఇచ్చేదే తక్కువ వేతనమని, అది కూడా నెల నెలా అందడం లేదని వాపోతున్నారు.

● కంప్యూటర్ ఆపరేటర్లదీ అదే పరిస్థితి..

జిల్లాలోని మండల పరిషత్ కార్యాలయాల్లో 38 మంది కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారు. వీరికి ప్రతినెల రూ.19,500 వేతనం ఇస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు పెంచాల్సింది పో యి తగ్గించడం ఏ మేరకు సమంజసం అని ఆప రేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అది కూడా మూడు నెలలుగా ఇవ్వడం లేదు. కంప్యూటర్ ఆపరేటర్లు మండల పరిషత్ కార్యాల యానికి, పంచాయతీలకు సంబంధించిన పలుర కాల విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

శాపంగా మల్టీపర్పస్ విధానం..



గ్రామ పంచాయతీ సిబ్బందికి శాపంగా మారిన మల్టీ పర్పస్ విధానంను రద్దు చేయాలి. మల్టీపర్పస్ విధానం వల్ల కార్యదర్శుల కంటే ముందు గ్రామ పంచాయతీ రికార్డులు ఎదుర్కొంటున్నారు. వెంటనే 51 జీవోను రద్దు చేయాలి. కారోబార్, బిల్ కలెక్టర్‌లకు ప్రత్యేక హోదా కల్పించాలి. కొన్ని నెలలుగా గ్రామ పంచాయతీలో పని చేస్తున్న ఆన్‌లైన్‌లో సాంకేతిక కారణాల వల్ల పేర్లు నమోదు కాని వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలి.

- నగేష్, కారోబార్ జేఏసీ చైర్మన్

కుటుంబ పోషణకు అవస్థలు..



మూడు నెలలుగా జీతాలు లేక పోతే కుటుంబా లను ఎలా పోషించాలి. మాకు ఇచ్చేదే తక్కువ జీతం కావడంతో అప్పు కూడా పుట్టడం లేదు. సకాలంలో జీతం చెల్లించాలని కోరినా ఫలితం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల బాధలను గుర్తించి దసరా పండగకు ముందే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

- సంతోష్, ఎంపీడబ్ల్యూ, కెరమెరి

నకిలీ నోట్ల కలకలం

హాజీపూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపే టలో ఆదివారం నకిలీ నోట్లు కలకలం సృష్టించాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుడి పేట లిక్కర్‌గోదాం పక్కనే గల బృందావనం కాలనీలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి డబ్బు పంపకాలు చేసుకుంటుండగా వారి మధ్య గొడవలు జరిగాయి. అందులోని బాధితులు అరవడంతో చుట్టుపక్కల ఉన్న స్థానికులు అక్కడికి చేరుకోవడంతో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు సంఘటన స్థలం నుంచి పారిపోయారు. అక్కడే ఉన్న మరో వ్యక్తి తనను ఎవరో మోసం చేశారని తన వద్ద లక్ష రూపాయలు తీసుకొని పారిపోయారని చెప్పడంతో అనుమానం వచ్చిన స్థానికులు అతన్ని నిలదీశారు. ఈంతో చంకలో ఉన్న సంచిని వదిలేసి అతడు కూడా సంఘటన స్థలం నుంచి పారిపోయాడు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆ సంచిని ఇంటికి తీసుకెళ్లాడు. ఆనోటా ఈనోటా ఈ విషయం పొక్కడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. సంచి పట్టుకెళ్లిన వ్యక్తి ఇంటికి వెళ్లి చూడగా అందులో నకిలీ నోట్లు కనబడ్డాయి. సంఘటన స్థలానికి చేరుకున్న మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్‌ఐ స్వరూప్ రాజ్‌లు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

ప్రాజెక్టు గేట్‌వాల్వ్ ధ్వంసం

కోటపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆల్గామ శివారులో ఉన్న ఆయపల్లి ప్రాజెక్టు కుడి కాలువ గేట్‌వాల్వ్‌ను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 300 ఎకరాలకు సాగునీరందుతుందని, గేట్‌వాల్వ్‌ను ధ్వంసం చేయడంతో ప్రాజెక్టులోని నీరు వృథాగా వెళ్తుందని చెబుతున్నారు.

బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ నిమజ్జనానికి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని పోచమ్మ చెరువు వద్ద బతుకమ్మ నిజ్జన ఏర్పాట్లను సంబంధిత శాఖ అధికారులతో పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేశ్, ఏసీపీ రవి కుమార్, నాయకులు మల్లయ్య, నాతరి స్వామి, రమేశ్, పాల్గొన్నారు.

బతుకమ్మ నిమజ్జన ఘాట్ల ఏర్పాట్లు


రాంనగర్‌లో బతుకమ్మ నిమజ్జన ఘాట్ పనులు చేస్తున్న దృశ్యం

నస్పూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్‌లో సోమవారం నిర్వహించే బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను ఆయా ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. నస్పూర్, సీతారాంపల్లి, నాగార్జున కాలనీ, రాంనగర్, తీగల్ పహాడ్, ఊరు శ్రీరాంపూర్, సీసీసీ టౌన్ షిప్, తదితర ఏరియాల్లో నీటి వనరుల వద్ద బతుకమ్మ నిమజ్జన ఘాట్ల పనులు చేపట్టారు. ఘాట్ల వద్ద బురద ఉండకుండా మట్టి, వెట్ మిక్స్‌ను వేసి చదును చేస్తున్నారు. కార్పొరేషన్ సిబ్బంది ఆయా ప్రాంతాల్లోని పిచ్చి మొక్కలను తొలగించారు.

రాష్ట్రంలో అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలం


బోనాలతో వస్తున్న బీజేపీ నాయకులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెరబెల్లి రఘునాథ్, జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీదే విజయమన్నారు. అనంతరం బోనాలతో తరలి వెళ్లి దుర్గామాతను దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు సప్పిడి నరేష్, నాయకులు అందుగుల శ్రీనివాస్,అక్కల రమేష్, వెంకటకృష్ణ , వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

యూరియా కోసం వర్షంలో రైతులు


యూరియా కోసం వర్షంతో నిల్చున్న రైతులు

కన్నెపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కన్నెపల్లి మండల కేంద్రంలో యూరియా బస్తాల కోసం ఆదివారం రైతులు వర్షాన్ని సైతం లెక్క చేయలేదు. కొంత మంది గొడుగులు పట్టుకుని, కొంత మంది వర్షంలో తడుస్తూ క్యూలో నిల్చుని యూరియా బస్తాలను తీసుకున్నారు. యూరియా కోసం మండలంలోని రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వర్షం అడ్డంకి

- ప్రారంభానికి నోచుకోని 306 ఇళ్లు
- పెరిగిన ధరలతో లబ్ధిదారులకు అదనపు భారం

కాసిపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మఇళ్ల నిర్మాణానికి వర్షం గండం వీడడం లేదు. మండలానికి మొదటి విడతలో 464 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 306ఇళ్లు ప్రారంభానికే నోచుకోలేదు. జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీవర్షాలకు ఇసుకకొరత తీవ్రంగా వేధిస్తుంది. ముడి సరుకులకు సైతం పెరిగిన ధరలతో లబ్ధిదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రైతులు పంటలువేసి పెట్టుబడులు పెట్టే సమయం కావడంతో రైతులు ఇళ్ల నిర్మాణంపై ఆసక్తి చూపడం లేదు. దీంతో మండలంలో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి.

పెరిగిన ధరలతో లబ్ధిదారులకు అదనపు భారం

సామాన్యుని సొంతింటి కల నిజం చేసేందుకు ఇందిరమ్మఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కానీ ఇళ్ల నిర్మాణాల నేపథ్యంలో నిర్మాణ ముడి సరుకుల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దీంతో లబ్ధిదారులపై అదనపు భారం పడుతుంది. రెండు నెలల క్రితం సిమెంటు బ్యాగు ధర రూ. 320 ఉండగా ప్రస్థుతం 370కి పెరిగింది. ట్రాక్టర్ లోడు సిమెంటు ఇటుక రూ. 7500నుంచి 8500కు పెరిగింది. కంకర వెయ్యి రూపాయల నుంచి రూ.1400లకు పెరిగింది. నెల రోజులుగా ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ నిలిచిపోవడంతో బ్లాక్‌లో ధర అదిరిపోతుంది. ఇలా ప్రతివస్తువు ధర పెరిగిపోవడంతో సామాన్యులు ఇళ్లను నిర్మించుకునే పరిస్థితిలేదని పేర్కొంటున్నారు. మండలంలోని బుగ్గగూడెం గ్రామ పంచాయతీని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి 117 ఇళ్లు మంజూరు చేశారు. కానీ ఇప్పటి వరకు కేవలం 35 ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. అందరు నిరుపేద గిరిజనులు కావడంతో కూలీలకు రోజు వారీగా డబ్బులు ఇవ్వడం కష్టంగా ఉందని వాపోతున్నారు. అందుకే ప్రభుత్వం మొబిలైజేషన్ అడ్వాన్సు కింద లక్ష రూపాయలను మంజూరు చేసి ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించేలా చూడాలని కోరుతున్నారు. లేదంటే గుత్తేదార్ల సహాయంతో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


ఇందిరమ్మ ఇంటి నిర్మాణ స్థలంలో నిలిచిన వర్షపు నీరు

● ఇందిరమ్మ ఇళ్ల మాటున ఇసుక అక్రమ రవాణా

మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పేరుతో వాగుల నుంచి ఇసుక గుట్టల నుంచి మొరం అక్రమ రవా ణా చేస్తూ దళారులు సొమ్ముచేసుకుంటున్నారు. ముత్యం పల్లి, గోండుగూడ, పెద్దనపల్లి వాగుల నుంచి ఇసుక అక్రమరవాణా చేస్తుండగా గుండ్లపాడ్‌గుట్ట నుం చి మొరం అక్రమరవాణా చేస్తున్నారు. ఒక్క ట్రాక్టర్‌కు అధికారుల నుంచి అనుమతులు తీసుకుని పది ట్రాక్టర్ లతో ఇసుక అక్రమరవాణా చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. ఈ విషయంపై సంబంధిత అధికారులకు చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మామూళ్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమరవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణం ఎన్టీఆర్ నగర్‌కు చెందిన చింతల రాకేష్ (22) చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, సీఐ ప్రమోద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం రాళ్లవాగులో చాపల వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి తండ్రి లచ్చయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విలీన గ్రామాల్లో బతుకమ్మ ఆటకు ఏర్పాట్లు

హాజీపూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల్లో బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో కార్పొరేషన్ అధికారులు ఆదివారం మొరం పోయించి చదును చేయించారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో విలీన గ్రామాల్లో బతుకమ్మ కష్టాలు అనే కథనం ప్రచురితం కాగా కార్పొరేషన్ అధికారులు స్పందించారు. ఆదివారం వేంపల్లి, ముల్కల్ల, గుడిపేట, నంనూర్, నర్సింగాపూర్ గ్రామాల్లో మహిళలు బతుకమ్మలు ఆడే ప్రదేశాల్లో బురదమయంగా ఉన్న ప్రదేశాల్లో మొరం, చిప్స్ పోసి రేపటి సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఘనంగా దుర్గామాత బోనాలు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వైట్‌బర్డ్ షటిల్ కోర్టు వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద ఆదివారం అమ్మవారి బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు దంపతులు బోనమెత్తుకుని ఊరేగింపుగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మహిళలు నృత్యాలు చేశారు. అనంతరం దుర్గామాతకు బోనాలను సమర్పించారు.

●పట్టణంలోని శ్రీకృష్ణ ఫంక్షన్‌హాల్ సమీపంలోని దుర్గామాత మండలంలో ఆదివారం దుర్గామాతకు మాజీ విప్ నల్లాల ఓదెలు, కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దుర్గం నరేష్, గుడ్ల రమేష్, పైడిమల్ల నర్సింగ్ పాల్గొన్నారు.

కుక్కలకు టీకాలు

తాండూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తాండూర్‌లోని ప్రాథమిక పశువైద్య కేంద్రంలో కుక్కలకు టీకాలను వేసినట్లు పశువైద్యుడు నరసింహారావు తెలిపారు. పెంపుడు కుక్కల యాజమానులు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలను వేయించాలని సూచించారు.


అపూర్వ సమ్మేళనంగా ఏర్పడ్డ 2007-08 బ్యాచ్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దండేపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దండేపల్లిలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలోని 2007-08లో పదో తరగతి వరకు చదివిన వారు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంగా ఏర్పడ్డారు. ముందుగా బస్టాండ్ నుంచి పాఠశాల వరకు ఊరేగింపు ర్యాలీ చేపట్టి మహిళలంత బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం వారు చదువుకున్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. అంతా కలిసి సహపంక్తి భోజనం చేసి సంతోషంగా గడిపారు.

మహిళలే మహారాణులు..!

(5వ పేజీ తరువాయి)

ఎన్నికల్లో 28 జనరల్ స్థానాలు ఉన్నాయి. వాటిలో అత్యధిక సీట్లలో మహిళలే బరిలో దిగే అవకాశాలు అనేకం ఉన్నాయి. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ విభాగాలతోపాటు ఆయా కేటగరీల్లో మహిళలకు కేటాయించిన సీట్లలోనూ వారి ప్రాతినిధ్యం అధికంగా ఉండనుంది.

సర్పంచ్ ఎన్నికల్లోనూ..

జిల్లా వ్యాప్తంగా 306 గ్రామ పంచాయతీలు ఉండగా, సర్పంచ్ ఎన్నికల్లో మహిళలు అధిక సంఖ్యలో బరిలోకి దిగనున్నారు. జిల్లా వ్యాప్తంగా సర్పంచ్ ఎన్నికల్లో 52 జనరల్ స్థానాలు ఉన్నాయి. వాటిలో సింహభాగం మహిళలే బరిలో దిగే అవకాశాలు అనేకం ఉన్నాయి. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ విభాగాలతోపాటు ఆయా కేటగరీల్లోని మహిళా కోటాలోనూ వారి ప్రాతినిధ్యం అధికంగా ఉండే అవకాశం ఉంది.

జడ్పీ పీఠం మహిళదే..

పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో మహిళలు తమ సత్తా చాటే అవకాశాలే మెండుగా ఉన్నాయి. పురుషులతో పోల్చితే అధిక సీట్లలో వారే పాగా వేయనున్నారు. ఇదిలా ఉండగా జిల్లా ప్రథమ మహిళ స్థానం అయిన జిల్లా పరిషత్ చైర్మపర్సన్ పీఠాన్ని సైతం బీసీ మహిళకే రిజర్వు చేయడం గమనార్హం. జిల్లాలోని బీసీ సామాజిక వర్గం జనాభా ఆధారంగా జడ్పీ 42 శాతం రిజర్వేషన్ ప్రకారం జడ్పీ చైర్మన్ పదవి బీసీ మహిళను వరించనుంది. జడ్పీ చైర్‌పర్సన్ పీఠాన్ని కైవసం చేసుకొనే అవకాశం ఉండటంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయా రాజకీయ పార్టీలు నారీ మణులకు, ముఖ్యంగా బీసీ విభాగంలో పెద్దపీట వేసే అవకాశాలు ఉన్నాయి.

వైభవంగా బతుకమ్మ సంబురాలు


బతుకమ్మ సంబరాల్లో డాక్టర్ శృతి గోలి, వైద్యులు, మహిళలు


బెల్లంపల్లిలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు, ఉద్యోగులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని బర్త్‌రూట్ ఆసుపత్రి వైద్యురాలు శృతి గోలి, కృష్ణచైతన్య దంపతుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి సామూహిక బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో ఆసుపత్రి సిబ్బంది, లక్ష్మీబాలాజీ నగర్ మహిళలు, చుట్టు పక్కల ప్రాంతాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కా ర్యక్రమంలో డాక్టర్ శృతి గోలి, డాక్టర్‌లు అవనిజ, ఈశ్వర్, నరేష్, శ్రీధర్, గోలి తిరుపతి, మహిళలు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని వ్యాలీపిచ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో మహిళలు ఐటీ ఉద్యోగులు బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఐటీ కంపెనీల్లో విధులు నిర్వహిస్తున్న మహిళలు అందరూ ఒక్కచోటకు చేరి బతుకమ్మలు పేర్చారు. డీజే పాటలతో ఉత్సాహంగా బతుకమ్మ ఆడి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

కూలీ కుటుంబం..గ్రూప్ 2లో ఉద్యోగం


కావిరి రాజమల్లు

కోటపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పేదరికం చదువుకు అడ్డు కాదని నిరూపించాడు మండలంలోని రొయ్యలపల్లి గ్రామానికి చెందిన కావిరి రాజమల్లు. వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందిన రాజమల్లు పట్టుదలతో చదివి గ్రూప్-2లో ఉద్యోగం సాధించాడు. ఆదివారం ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-2 ఫలి తాల్లో రాజమల్లు రాష్ట్రంలో 1353వ ర్యాంకు సాధించి అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ (ఏసీటీ) ఉద్యోగం సాధించాడు. గ్రామానికి చెందిన కావిరి బానయ్య-బానక్క దంపతులకు ఇరువురు కుమారులు కాగా చిన్నవాడైన రాజమల్లు రెండవ తరగతి నుంచి ఇంటర్ వరకు హైద్రా బాద్‌లో.. డిగ్రీ మంచిర్యాలలో..పీజీ ఎంఎస్సీ కెమిస్ట్రీ హైద్రాబాద్‌లోని నిజాం కాలేజీలో పూర్తి చేశాడు. పదేళ్ల క్రితమే తల్లి బానక్క అనారోగ్యంతో మృతి చెందింది. రెండేళ్లుగా గ్రూప్స్‌పై దృష్టి పెట్టి చదివి ఉద్యోగం సాధించాడు.

ఆలయంలో ఆదివాసీ గిరిజనుల పూజలు

దండేపల్లి, సెప్టెంబరు, 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిరేవు గో దావరి తీరాన గల శ్రీపద్మల్‌పూరీ కాకో ఆలయంలో ఆదివారం ఆదివాసీ గిరిజనులు ప్రత్యేక పూజలు నిర్విహించారు. ప్రతీ ఏటా ఆలయంలో పూజలు నిర్వహించడం సాంప్రదాయంగా జరుగుతున్న కార్యక్రమం అని గిరిజన అభివృద్ధి సంక్షేమ శాఖ చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కుడిమేత సోము, వైస్ చైర్మన్ కురుం లింగారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనక జంగు, ఆదివాసీ న్యాయవాది పెంద్రం గోపి, ఆదివాసీ సేవా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పెంద్రం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మర్సుకోల లచ్చు, సంతోష్, రాజు, బాజీ రావు, దొందేరావు, శ్రీనివాస్, భగవంత్‌రావు, రామస్వామి పాల్గొన్నారు.

మార్కెట్లో పూల సందడి


నస్పూర్‌లో పూలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

నస్పూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సద్దుల బతుకమ్మ సందర్భంగా నస్పూర్‌లో ఆదివారం ఆయా కూడళ్ల వద్ద పూల కొనుగోళ్ల సందడి నెలకొంది. సీసీసీ కార్నర్, సీసీసీ టౌన్‌షిప్, గోదావరి కాలనీల్లో చిరు వ్యాపారులు బంతి, గునుగు, గులాబీ, చామంతి, తంగేడు తదితర పూల అమ్మకాలు జోరుగా సాగాయి. బంతి కిలో రూ. 100 నుంచి 120వరకు, గులాబీ, చామంతి పావు కిలో రూ. 100, గునుగు కట్ట రూ. 10, సీతామ్మ జడాలు నాలుగు కట్టలు రూ. 100 కు అమ్ముతున్నారు.

సద్దుల బతుకమ్మపై సందిగ్ధం

మందమర్రిటౌన్ : పూలను పూజించి ఆరాధించే సద్దుల బతుకమ్మపై సందిగ్ధత నెలకొంది. ఈ పండగ ఎప్పుడు అనేది మహిళలకు ఎటు తేల్చుకోలేని పరిస్థితి వచ్చింది. ఎంగిలిపూల బతుకమ్మ ప్రారంభమైన నాటి నుంచి 9 రోజులకు సద్దుల బతుకమ్మ ఆడుతారు. కానీ ప్రభుత్వం ఈ నెల 30న సద్దుల బతుకమ్మ అని ఆదేశాలు జారీ చేయడంతో సద్దుల బతుకమ్మ ఈ నెల 29న లేక 30న అని మహిళలు మదన పడుతున్నారు. మంచిర్యాల జిల్లాకు సంబంధించి రెండు రోజులు ఆడే పరిస్థితులు నెలకొన్నాయి. అధిక శాతం సోమవారం సద్దుల బతుకమ్మ ఆడేందుకు సిద్ధమవుతున్నారు. ఆదివారం పెద్ద ఎత్తున మార్కెట్‌లో పూల కొనుగోళ్లు జరిగాయి. కొన్ని చోట్ల మంగళవారం ఆడేందుకు కూడా చూస్తున్నారు. మొత్తానికి సద్దుల బతుకమ్మ జిల్లాలో రెండు రోజులు సాగే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఏర్పాట్లు పూర్తి

పట్టణంలోని పలు బతుకమ్మ ఘాట్‌లను మున్సిపల్ కమిషనర్ రాజలింగు పరిశీలించారు. విద్యుత్ దీపాలతో పాటు బుతకమ్మలు నిమజ్జనం చేసే చెరువులను పరిశీలించారు. మినీ ట్యాంక్ బండ్ వద్ద చెరువును పరిశీలించి చెత్తా, చెదారం, పిచ్చి మొక్కలు తొలగించాలని సిబ్బందికి సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి ఆదేశాల మేరకు బతుకమ్మ ఘాట్‌ల వద్ద తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఘాట్‌ల వద్ద ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. మున్సిపాలిటీలోని బతుకమ్మఘాట్‌లు, చెరువుల వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకుడు బండి సదానందం యాదవ్, సిబ్బంది ఉన్నారు.


బతుకమ్మ ఘాట్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజలింగు

లాభాలవాటా చెల్లింపులో నష్టం

మందమర్రిటౌన్, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి లాభాలవాటా చెల్లింపులో తీరని నష్టం జరిగిందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి తెలిపారు. ఆదివారం విలేకరులతో మా ట్లాడుతూ గత టీఆర్ఎస్ ప్రభుత్వం, సంస్థ అభివృద్ధి ఉద్యోగుల సంక్షేమం పేరిట వేలకోట్లు లాభాలావాటా నుంచి పక్కన పెట్టిందని అదే తరహాలో ప్రజా ప్రభుత్వం కూడ ఈ సంవత్సరం లాభాలవాటాను 4వేల 32 కోట్లు పక్కన పెట్టిందన్నారు. ఈనిధులను నూతన గనుల ఏర్పాటుకు, ఉద్యోగుల సంక్షేమానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. వెంకటస్వామి, అల్లీ రాజేందర్‌లు పాల్గొన్నారు.

పూలను పూజించే పండగ బతుకమ్మ

మందమర్రిటౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పూలను పూజించే ఏకైక పండగ బతుకమ్మ పండగఅని టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మహిళలకు బతుక మ్మచీరలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మహిళలందర్ని గౌరవించాల ని చీరలను పంపిణీ చేశామన్నారు. 200ల మందికి పైగా మహిళలకు చీరలను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసాల సంపత్, జూపాక సంధ్య, సుకన్య, కవిత, సుగుణ, భాగ్య, రాజు, సత్యనారాయణ, రాజు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి


భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మాజీ సైనికుడు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రెండవ జోన్ దుర్గా మాత మండపం సమీపంలో ఆదివారం విప్లవ వీరుడు భగత్‌సింగ్ జయంతిని మాజీ సైనికుడు రాజేష్ ప్రి హ్వాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. ఈ కార్య క్రమంలో వికాస సమితి నాయకులు సుందిల్ల రాజయ్య, రవీందర్, తిరుపతి, వెంకటేష్, రాంరెడ్డి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

●భగత్‌సింగ్ జయంతిని ప్రజా సేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి సొసైటీ అధ్యక్షుడు అజుముద్దీన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు రాజ్‌కుమార్, జావేద్ పాషా, నాగరాజు, గణేష్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: నేటి యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎంసీపీఐయు జిల్లా కార్యదర్శి ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పసులేటి వెంకటేశ్‌లు అన్నారు. ఆదివారం పట్టణంలోని భగత్‌సింగ్ విగ్రహానికి నాయకులతో కలిసి పూల మాలలు వేసి మాట్లాడారు. నాయకులు రమేశ్, రాహుల్, సంజయ్, సునిత్, పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: విప్లవ వీరుడు భగత్‌సింగ్ జయంతి వేడుకలను ఆదివారం రిటైర్డు ఆర్మీ జవాన్ రాజేష్ ప్రిహ్వాల్ ఆధ్వర్యంలో మందమర్రిలో ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వికాస సమితి రాష్ట్ర కార్యదర్శి రవీందర్, కవి, గాయకుడు సుందిళ్ల రాజన్న, రాణి ప్రిహ్వాల్, తిరుపతి పాల్గొన్నారు.

అమ్మవారికి 108 రకాల నైవేద్యాలు

దండేపల్లి సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేవీ శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పుష్కరించుకోని 6రోజు అమ్మవారు అన్నపూర్ణ దేవికి కూరగాయాలతో అలంకరణలో భాగంగా శనివారంరాత్రి మండలంలోని కన్నెపల్లిలో ఏర్పాటు చేసిన దుర్గదేవికి 108 రకాల ప్రత్యేక నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు ఆనందంతో దీపంలో అమ్మవారు రూపంలో కనించడం పట్ల భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా దుర్గదేవి మాతకు అలంకరణ చేపట్టారు. అమ్మగారి అనుగ్రహం అందరిపై ఉండాలని భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆంధ్రజ్యోతి
8

కుమరం భీం
జిల్లా వార్తలు
సోమవారం 29 సెప్టెంబరు 2025

బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేయాలి

కాగజ్‌నగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. కాగజ్‌నగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెల్పించాలన్నారు. ఇందుకు ప్రతి కార్యకర్త తన వంతుగా కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కోనప్ప బీఆర్‌ఎస్‌లో చేరడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ ఈ ప్రాంతా అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్ ఎనలేని నిధులిచ్చి అభివృద్ధి చేశారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటుదామని, తిరిగి ఈ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పూర్వవైభవం తెచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిర్పూరు నియోజకవర్గం వివిధ మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రిజర్వేషన్లలో ఆదివాసీలకు అన్యాయం


మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

కెరమెరి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లలో ఆదివాసీలకు అన్యాయం జరిగిందని ఆదివాసీ గిరిజన నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో రిజర్వేషన్లను కూడా దోపిడీ చేసేలా కుట్రలు పన్నుతున్నారన్నారు. కెరమెరి జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించకుంటే స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో లక్ష్మణ్, దేవ్‌రావు, జగన్నాథ్‌రావు, విజయ్‌కుమార్, ప్రభాకర్, రఘునాథ్, భరత్‌భూషన్, చందన్నా, మోతిరాం, దృపతాబాయి, తుకారాం, భీంరావు, నాగోరావు, జాలీంషావ్, ధర్ము, జగన్నాథ్‌రావు, కుసుంరావు, ఆనంద్‌రావు, రాంచందర్, బాదిరావు, రాంచందర్, బాపురావు, బీర్షవ్, సురేష్, దేవ్‌రావు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకా

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పశువైద్య శాలలోప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పెంపుకు కుక్క పిల్లలకు రేబిస్ వ్యాధి నిరోధ క టీకా వేశారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ సురేష్, మండల పశువైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణ, కెరమెరి పశు వైద్యాధికారి సురేష్, సిబ్బంది సుప్రియ, ప్రశాంత్, వినోద్, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జైనూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్లవాయి విశ్రాంత పోస్ట్‌మ్యాన్ నారాయణ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని టీపీసీసీ ఉపాధ్య క్షురాలు ఆత్రం సుగుణక్క పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ కన్వీనర్ సునీల్ జాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్, మాజీ సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేష్, గ్రామస్థుడు ఆడ సెడ్మరావ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల మండల కమిటీ

బెజ్జూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం క్రీడా కారుల మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ధర్మయ్య, అధ్యక్షుడిగా పుల్లయ్య, ఉపాధ్యక్షుడిగా రమేష్, ప్రధాన కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా మహేష్, ప్రచార కార్యదర్శులుగా సిద్దు, సుభాష్, పవన్, శ్రీకాంత్, భీంరావుతో పాటు మరో 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

మార్కెట్‌లో పండుగ సందడి

- పూలకు పెరిగిన గిరాకీ
- కిక్కిరిసిన వస్త్ర దుకాణాలు
- పల్లెలకు ప్రజల ప్రయాణం
- నేడు సద్దుల బతుకమ్మ


బెజ్జూరులో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ, దసరా పండగలతో సందడి నెలకొంది. జిల్లాలో సోమవారం సద్దుల బతుకమ్మ పండుగ జరుపకోనున్నారు. దీంతో ఆదివారం ప్రజలు షాపింగ్‌లో బిజీ బిజీగా గడిపారు. దీంతో వస్త్ర దుకాణాలు, లేడిస్ ఎంపోరియంలు, కిరాణం షాపులు రద్దీగా మారాయి. హిందువులకు దసరా అతి పెద్ద పండుగ, నవరాత్రి ఉత్సవాలు, శరన్నవరాత్రి ఉత్సవాలు జరుపుకున్న ప్రజలు చివరగా దసరా వేడుకలను నిర్వహించుకుంటారు. ఈ పండుగకు అందరూ కొత్త దుస్తులు ధరిస్తారు. అందుకే వస్త్ర దుకాణాలు కిటకిటలాడాయి. ఈ నేపథ్యంలో ఆసిఫాబాద్ పట్టణంలోని రెడిమేడ్ దుస్తుల దుకాణాలు సందడిగా మారాయి. మహిళలకు అతి పెద్ద పండగ అయిన సద్దుల బతుకమ్మ సందర్భంగా వివిధ రకాల పూలు, రంగుల కొనుగోలులో మహిళలు, యువతులు బిజీ బిజీగా గడిపారు. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చేందుకు పూలను కొనుగోలు చేపట్టారు. పండుగ కోసం ప్రజలు పట్టణాల నుంచి స్వగ్రామాల బాట పడుతున్నారు. వారి రాకతో గ్రామాల్లో సందడిగా మారుతున్నాయి. పండగ రోజున పిండి వంటల కోసం సామగ్రి కొనుగోలు నేపథ్యంలో కిరాణం దుకాణాలు రద్దీగా మారాయి. రెండు, మూడు రోజుల నుంచి జిల్లాలో వ్యాపారం పెరిగింది. మార్కెట్‌లో పూల కొనుగోళ్లు సైతం జోరుగా కొనసాగాయి. బతుకమ్మ తయారీలో కీలక భూమిక పోషించే తంగెడు పూలు, గునుగు, పట్టుకుచ్చులు, బంతి, చేమంతి పూలు కొనుగోలు చేస్తున్నారు. కాగా ఈ ఏడాది పూల ధరలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. ఒక మోస్తరు బతుకమ్మ తయారీ కోసం వెయ్యి రూపాయల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని వినియోగదారులు వాపోతున్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలో ఆదివారం జరిగిన వార సంతలో బతుకమ్మ, దసరా పండగల సందడి నెలకొంది. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో కొనుగోలు దారులు రావడంతో వార సంత కిటకిటలాడింది. బట్టల దుకాణాలు, పూల దుకాణాలు, కాస్మోటిక్ దుకాణాల్లో యువతీ యువకులు సామాగ్రిని కొనుగోలు చేశారు. బతుకమ్మ పండగ నేపథ్యంలో యువతులు, మహిళలు దుస్తులు, డ్రెస్సులు, శారీలు, వివిధ కాస్మోటిక్స్ కొనుగోలు కోసం తరలి వచ్చారు. యువకులు దసరా పండగకి బట్టలు కొనుగోలు చేసేందుకు షాపులలో బారులు తీరారు. అదే విధంగా పండగ కోసం వివిధ రకాల పిండి పదార్థాలు చేసుకోవడానికి సామగ్రిని కొనుగోలు చేశారు. వారసంత పండగల నేపథ్యంలో కొనుగోలుదారులతో సందడిగా మారింది.


ఆసిఫాబాద్‌లో మహిళల కొనుగోళ్లు

భగత్‌సింగ్‌కు ఘన నివాళి


ఆసిఫాబాద్‌లో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఆదివారం భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఆయా పార్టీలు సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ భగంత్‌సింగ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లికార్జున్, పెంటన్న, ప్రసాద్, జయరాజ్, ప్రసాద్‌గౌడ్, సత్యనారాయణ, లింగమూర్తి, శంకర్, బిజ్జు, విలాస్, గట్టయ్య, మల్లేష్, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి మాలలు వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ ఆశయాలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు జైరాం, శ్యాంరావు, రాజేశ్వర్, ప్రతాప్, మహేష్, అమూల్, మనోజ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

సిర్పూర్(టి), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రులను పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ప్రతి రోజు ఒక్కో వాహనంపై దేవుడి ఊరేగింపు నిర్వహిస్తున్నారు. అలాగే ఆలయ ఆవరణలో నిత్య అన్నదానం నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులను ఎమ్మెల్సీని సన్మానించారు.


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్

రిజర్వేషన్ల ప్రక్రియపై భగ్గుమన్న ఆదివాసీలు

జైనూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఖరారు చేసిన ఎంపీపీ, జడ్పీటీసి స్థానాల రిజర్వేషన్లలో తమకు అన్యాయం జరిగిందని ఆదివాసీ సంఘాలు భగ్గుమంటున్నాయి. మండలంలోని ఢబోలిలో ఆదివారం ఆదివాసీలు సమావేశమై పలు తీర్మానాలు చేశారు, జడ్పీటీసీతో పాటు జడ్పీ చైర్మన్ రిజర్వేషన్లు గిరిజన ప్రాంతంలో పెసా చట్టానికి అనుకూలంగా లేవని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి గిరిజన ప్రాంతంలో పెసా చట్టానికి అనుగుణంగా ఎంపీపీ, జడ్పీటీసీ, జడ్పీ చైర్మన్ల పదవులను గిరిజనుల ద్వారానే భర్తీ చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో మహగాం, మార్లవాయి, ఢబోలి రాయి సెటర్ల సార్మేడిలు జుగునాక దేవరావ్, కుంర దుందేరావ్, నాయకులు మడావి భీంరావ్, కుంర శాంరావ్, మేస్రాం రాహుల్, ఆత్రం రవిందర్, మేస్రాం నాగోరావ్, మేస్రాం సీతారాం, తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు మధురాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా అందించాలి


టోకెన్ల పంపిణీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

పెంచికలపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియా అందిం చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆదేశించారు. మండలంలోని చెడ్వాయి రైతు వేదికలో యూరియా పంపిణీ సరళిని ఆదివారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అధైర్య పడవద్దని సరిపడా యూరియా అందు బాటులో ఉందని అన్నారు. అధికారులు యూ రియా పక్కదారి పట్టకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు అన్యాయం జరిగితే ఎవరిని ఉపేక్షించేది లేదని అన్నారు. యూరియా అందని రైతులు వ్యవసాయాధికారులు అందిస్తున్న టోకెన్లు తీసుకోవాలని సూచించారు. వారికి కూడా యూరియా బస్తాలు పంపిణీ చేస్తారని తెలిపారు. యూరియా అవసరమైన మేర అందుతుందని చెప్పారు. రైతులు ఆందోళనకు గురికావద్దని సూచించారు. ఈ మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

బెజ్జూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన తోటపల్లి సంధ్యకు మంజూరైన రూ.47 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం ఎమ్మెల్సీ దండె విఠల్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెంటన్న, సదాశివ్, అంకులు, శంకరయ్య, తిరుపతి, మహేష్, సత్తన్న, మహేష్ పాల్గొన్నారు.

వారసంతలో కనీస సౌకర్యాలు కరువు


బురదమయమైన వారసంత

కెరమెరి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతీ ఆదివారం కొనసాగుతున్న వారసంతలో కనీస సౌకర్యాలు లేక బురదమయంగా మారింది. వార సంతకు లక్షల ఆదాయం వస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించడం లేదని వార సంతకు వచ్చిన వ్యాపారులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. చిన్న పాటి కవర్లు వేసుకుని విక్రయిస్తున్నారు. అధికారులు వార సంతలో కనీస సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని కోరుతున్నారు. మండలంలో ఒకే వార సంత ఉండడంతో ఈ సంతకు అన్ని గ్రామాల ప్రజలు వచ్చి వారం రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తుంటారు.